# ఊరు అదృశ్యం

పొద్దు పొడిచేవేళ. ఒక్కసారి పల్లె తల్లడిల్లింది. ఆ గూడెంలోని నాలుగు ఇళ్ళలో పసిపాపలు కళ్ళు తెరువలేదు, కదలలేదు. తల్లులు పాలిచ్చే ప్రయత్నం చేస్తున్నా పసివాళ్ళు నోరు తెరవలేదు. కదిపిచూశారు. కదలికలు లేవు. తల్లులు తల్లడిల్లిపోతూ నెత్తీ నోరు కొట్టుకుంటూ ఉన్నారు. ఒక్కరాత్రే నలుగురు పసివాళ్ళు ప్రాణం వదిలారు. అంతుపట్టని అనర్ధం. రచ్చబండ దగ్గర చిన్న, పెద్ద కూడుతున్నారు. అందరి తల్లులోనూ ఊరికేమయింది? అనే ప్రశ్న.

కొందరు "చేతబడి" అన్నారు. మరికొందరు "ఊరికి కీడు వచ్చింది. పండుగ చేయక పదేండ్లు అయింది" అన్నారు.

మంత్రగాండ్లను పిలిచి ఊరి పెద్దలు అడుగుతూ ఉన్నారు.

"చేతబడి, దయ్యాలు, భూతాలు ఉండవు" ఆ గూడెపు టీచర్ సత్యం అన్నాడు.

'ఉండకుంటే పాము కరిచినపుడు, తేలు కరిచినపుడు, మంత్రించే' సంగతిని గుర్తుచేశారు వాటినే నమ్ముతున్నవాళ్ళు.

"మంత్రగాళ్ళను చెట్టుకు కట్టి అడిగితే తెలుస్తది" అన్నారు.

"లేదు, మంత్రాలు వుంటాయి అనేది మూఢనమ్మకం. నిజం తెలుసుకోక మూర్ఖంగా మరొకరిని బాధించకూడదు" అన్నాడు సత్యం.

"అయితే నేను మండలానికి వెళ్ళి డాక్టరును తీసుకువస్తాను" అన్నాడు సర్పంచ్ యాదగిరి.

"చంపినోళ్ళు తేలవలసిందే" అన్నారు కొందరు.

"మీరు మంకుపట్టుపడితే పోలీసులు వస్తారు" అన్నాడు సత్యం.

"వస్తారు కాదు, అదిగో వస్తూనే వున్నారు" అన్నాడు వచ్చేవాళ్ళవైపు చూస్తూ సర్పంచ్. పోలీసులొచ్చారు, మధ్యాహ్నం వరకు డాక్టరు వచ్చాడు. రెవెన్యూ అధికారులు దిగారు.

"ఏం జరిగింది? ఎందుకు జరిగింది?" అని అధికారులు ఆరా తీస్తూనే ఉన్నారు. కావలివాడు వార్త చేరవేయడంతో కదిలొచ్చిన యంత్రాంగం తన పని చేస్తూనే వుంది.

"అయ్యా నేను పుట్టి బుద్ధి ఎరిగిన నాటి నుండి ఈ ఊళ్లో ఇసుంటి రోగాలు రాలేదు" అన్నాడు ఉయ్యాల గోపయ్య. వయసు ఢెబ్బైకి పైనే వుంటుంది.

"అదే మేము ఆలోచిస్తున్నాం" అన్నాడు డాక్టరు.

" నేను ఆలొచిస్తే తట్టింది ఈ ఫ్యాక్టరీల వల్లనే " అని అన్నాడు గోపయ్య రెండు చేతులు జోడించి.

అందరు ఒకేసారి గోపయ్యవైపు చూశారు. అధికార్లూ ఆలోచించదగ్గవిషయమే అన్నట్టు చూశారు. పొద్దంతా ఇదే విషయం మీద చర్చ జరిగింది.

"మనం భూములను అమ్మకపోతె ఈ ఫ్యాక్టరీలు రాకపోవు, ఈ గతి పట్టకపోవు కదా "అని తలపట్టుకున్నారు ఆ ఊరి రైతులు. గూడానికి ఏదో కీడు మూడినట్టుందని గ్రహించిన కుక్కలు అటు ఇటు పరిగెత్తుతున్నాయి.

" అప్పటి డబ్బును చూసుకుంటే ఎప్పటికి ఉపవాసాలే మిగిలె " అంది రాములు భార్య సీతమ్మ.

"అందర్కీ ఉద్యోగాలిస్తమనిరి " నడివయసు వ్యక్తి రంగయ్య గుర్తు చేశాడు.

" ఉద్యోగాలా ఇంకేమన్నానా. ఎవరన్నా పోయి అడిగితే ఏం చదివినవనిరి. చదువప్పుడు ఏం ఉద్యోగం చేస్తవనిరి " మరో వ్యక్తి వెంకులు అన్నాడు.

"అవి మందులు తయారు చేసే కంపెనీలు, వాటిలో ఆటోమేటిక్ మిషన్లు ఉంటాయి. వాటిని నడపాలంటే స్కిల్డ్ వర్కర్స్ కావాలి. అంటే ఆయా పనిని నేర్చుకున్నవాళ్ళు కావాలి కదా " అన్నాడు డాక్టరు.

"మరిమాకు చదువురాదని వాళ్ళకు తెలుసు కదా ఏంకొలువులు ఇస్తమని ఆ మాటన్నట్టు "అని అడిగాడు వెంకులు. ఫ్యాక్టరీ వాళ్ళతోనే డైరెక్టుగా మాట్లాడ్తున్నట్టు ముఖం పెట్టి.

"అప్పుడు అన్నారేమో కాని ఇప్పటి పరిస్థితిని మనం చూస్తూనే వున్నాం కదా "అన్నాడు డాక్టరు.

"అంటే మాట మీద వుండేది లేదా. సదువుకున్నోరు కదా. మాట అనే ముందే ఆలోచించి అనాలె. ఉన్న భూమిని అమ్ముకొని, చేసేందుకు పని లేక దేశానికొకడు పోయిరి. వాళ్ళొకతాడ, వాళ్ళ భార్యాపిల్లలొకతాడ. నాబోటి సేతగాని ముసలోల్లం కూటికి సస్తుంటిమి. ఆకలికి తోడు ఈ కొత్త రోగాలాయె "అన్నాడు గోపయ్య. అప్పుడు ఆయన కళ్ళల్లో కన్నీరు ఒలికింది. ఆ దృశ్యం అక్కడున్న అందర్నీ కదిలించింది.

ఉపవాసాలతో పేగులు ముడుచుకుపోయి, కడుపు వెన్నుకు అంటకపోయి ఎదరొమ్ముల ఎముకలు కనిపిస్తూ దఃఖాన్ని కూడా భరించలేని బక్కబతుకులు.

"ఆ ఫ్యాక్టరీలను బందు చేపియ్యాలె అంతే " అన్నాడు ఓ నిరుద్యోగ యువకుడు.

"అంతే , అంతే "అన్నారు అక్కడున్న నిరుద్యోగ యువకులు. అక్కడున్న వాళ్ళందరూ రకరకాలుగా మాట్లాడుతున్నారు.

"అయ్యా ఈ ప్రాంతంలో తాటికల్లు ఎక్కువ. ఇక్కడినుండి చాలాచోట్లకు లారీలలో కల్లు పోసకపోయేది. ఆ చెట్లనే కొట్టేశారు "అన్నాడు ఎంకులు.

" చెట్లు కొట్టేయకుండా ఫ్యాక్టరీలు ఎలా కడతారు? " అడిగాడు ఎమ్మార్వో.

" ఇగ కొట్టినయి కొట్టంగా చుట్టూరా మిగిలినయి కల్లు గీస్తే ఆ రంగే వేరుంటది. ఆకలిదప్పులకు తట్టుకోలేక దాన్ని తాగితే తెల్లవార్లు కడుపులో మంట, నిద్రరాదు, పొద్దున లేవంగానే కండ్లే తెరువరాదు " అన్నాడు మరో వ్యక్తి పిట్టల రామలింగం, తన భూమి పోయినాక కంప కట్టె కొట్టి బొగ్గులుగా కాల్చి పూట గడుపుకుంటున్నాడు. ఎండలో ఎండి వానలో తడిసి తానూ బొగ్గు రంగులోకి మారాడు.

"ఆ ఫ్యాక్టరీలు ఒదిలే రసాయనాల గాలి వల్ల అట్లా అయ్యే అవకాశముంది " అన్నాడు డాక్టరు.

"అట్లనే అయితుంది అందరూ నిద్ర పోయినంక ఆ మందులు కల్సిన నీటిని వదులుతారు. ఆ నీరు పారినంత భూమిల గడ్డీ మొలవదు. పొగ పోయినంత దూరం కల్లుగూడ విషపూరితం అయి ఇగో ఈ అవస్థలు " అన్నాడు ఆ గ్రామ సర్పంచ్ యాదగిరి.

" మీరు ఏం చెప్పదలచుకున్నారో పంచాయితీ బోర్డులో పెట్టి ఓ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపండి, మేం కూడా మా రిపోర్టును పంపుతాం " అన్నాడు డాక్టరు.

"గ్రామ పంచాయితీ వాళ్ళు తీర్మానం చేస్తారా నెలనెల గ్రామ పంచాయితీకి వేలకు వేలు ముడుతూనే ఉంది " అన్నాడు వెంకులు ఎం. అర్. ఓ. వైపు చూస్తూ.

"చూడు మామ ఇప్పటి వరకు వాళ్ళు ఇచ్చిన డబ్బుతో కాలువలు కట్టిచ్చినం, రోడ్లు వెయించినం, దీపాలు పెట్టిచ్చినం, గుడి మాత్రం వాళ్లే కట్టిచ్చిండ్రనుకో " అన్నాడు సర్పంచ్.

"కట్టియ్యరు ! గుడి కట్టిస్తరు. గుడి కట్టిచ్చి బాగానే భజన చేయమంటరు. మరి కడుపు సంగతి ఏమిటి? దాని గురించి ఎవ్వరు ఏం చేయరు " అన్నాడు గోపయ్య. కాసేపు ఎవ్వరు ఏం మాట్లాడకుండా మౌనంగా ఉన్నారు.

"ఆలోచించేది ఏంలేదు ఫ్యాక్టరీలను కూలగొడదాం. ఎవని భూమిని వాడు దున్నుకుందాం " అన్నాడు మొదటి యువకుడు అదొక్కటే మార్గం అన్నట్టు చూస్తూ.

"అది అయ్యేపనేనా? మన భూములను మనమే కదా అప్పుడు అమ్ముకున్నది " అన్నాడు సర్పంచ్.

"నీవు అంతే మాట్లాడతవు. నీకూ అంతో ఇంతో ఇస్తరు కదా " గుంపులో ఒకరు అన్నారు.

"సరే నాకిస్తుండ్రో యిస్తలేరో ఇప్పుడు నేను ఇస్తలేదు అంటే నమ్ముతారా? నాకంటే ముందు నలుగుర సర్పంచ్‌లు చేసిండ్రు కదా వాళ్ళకిస్తే నాకిచ్చినట్టే " కొంచెం బాధగా

అన్నాడు .

"నీకేంది నీ భార్యాపిల్లలను పట్నంలో పెట్టినవ్. నువ్ అక్కడనే వుంటున్నవ్. ఈ బాధలు నీకెక్కడివి " అన్నారు మరొకరు.

" సరే నాభాదలు నాకున్నయ్ . నా పొట్ట తిప్పలకు అక్కడ నాపనేదో నేను చేసుకుంటున్న. నేనైతే ఊరిని మరిచిపోయి అక్కడనే ఉంటలేను కదా "

"అట్లంటే. ఊరిడిసి ఎందరు దుబాయికి, బొంబాయికి పోలేదు. అంతెందుకు పట్నంలో లేరా?" అన్నాడు నిలదీసినట్లు చూస్తూ. మళ్లీ మౌనం చోటు చేసుకుంది.

"అయితే మన ఊరికొచ్చే భాదలన్నింటికి నేనే కారణమైతె ఈ సర్పంచ్‌తనానికి నేను రాజీనామా చేస్తాను. మీరు మరొకరిని ఎన్నుకోండి " అన్నాడు యాదగిరి ఉన్నచోటునుండి కదులుతూ.

"చూడండి ఇది ఫ్యాక్టరీల కాలుష్యం మూలంగా వస్తున్న ఇబ్బంది. సర్పంచ్ మూలంగా కాదు. ఒకవేళ మీరు ఆయనే కారణమనుకుంటే ఆయన దిగిపోతానంటున్నాడు. అదలా వుంచండి. ముందు మనం ఈ రోగాల బారి నుండి తప్పించుకోవటం ఎట్లా? " అన్నాడు సత్యం.

"అదే మీరేమి చెపుతారో చెప్పండి " అన్నాడు యాదగిరి.

"చెప్పాము కదా. విషయాన్ని ప్రభుత్వానికి తెలియచేయాలని "అన్నాడు డాక్టరు.

"ఇంతకుముందే ఎన్నో ధరఖాస్తులు ఇచ్చినం. ఎం. ఎల్. ఏ కు, మంత్రి గారికి ఇచ్చినం, ముఖ్యమంత్రి గారికి ఇచ్చినం సార్. ఎవరు ఏం చేయలేదు. ఎవ్వరి దగ్గరకెళ్ళినా చూస్తాం, చేస్తాం అన్నారే తప్ప ఇప్పటివరకూ ఎవ్వరూ ఏం చేయలేదు " అన్నాడు సర్పంచ్.

" నేను చెప్పాకదా సార్. రాత్రికి రాత్రే కూలగొడితే పాయే " అదే యువకుడు.

"అది నీవనుకున్నంతగా ఈజీ పనేమీ కాదు మిత్రమా. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లంగా మారుతుంది. అప్పుడు వ్యవహారం చేయి దాటిపోతుంది. అందరూ జైలుపాలైనా అవ్వచ్చు " అన్నాడు అప్పటివరకు వింటున్న రెవెన్యూ అధికారి.

" అయితే మంచిదే సార్ అందులోనైనా ఇంత కూడు దొరుకుతది "

ఆ మాటకు రెవిన్యూ అధికారికి రాబోయిన నవ్వు నోట్లోనే ఆగింది. అందరు కాసేపు ఆలోచిస్తూ నిలుచున్నారు. పంటలు లేక, పని దొరకక యువత ఎలా ఆలోచిస్తున్నదో పై మాటల ద్వారా ఊహించవచ్చు.

"ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారలేదు. ఎవర్కి ఓటేసినా ఎవ్వరేమి

చేయకపోతిరి " కంటనీరు పెట్టుకున్నాడు గోపయ్య.

"మరీ అట్లా అంటే ఎట్లా. మొదటికి ఇప్పటికి కొంతమార్పు వచ్చింది. ఇంకా రానున్నది " అన్నాడు ఎమ్మార్వో.

"ఉన్న భూమిని అమ్ముకొని ఎవర్నంటే ఏం లాభం " గుణిసింది సీతమ్మ.

"అప్పటిమేలు చూసుకొని ఎప్పటికి బతుకుతమనుకొన్నరు మా మొగోళ్ళు " అంటూ అంగలార్చింది ఓ ముసలామె.

" ఊకె ఆలోచించేదెందుకు. అందరం పోయి ఈ ఫ్యాక్టరీలు నడవకుండ ఆపేయాలి" అన్నాడు వెంకులు.

సరే అంటే సరే అనుకున్నారు అందరూ.

మరునాడు ఫ్యాక్టరీల గేట్లముందు గూడానికి గూడెమే కదిలొచ్చి బైఠాయించింది. ఫ్యాక్టరీ బస్సులను గేట్లముందే ఆపేశారు, వాళ్ళకు మద్దతుగా ఎర్రజెండాల నినాదాలు.

" మా భూములు..... " ఓ కామ్రేడ్ అనగానే -

" మాకు తిరిగి ఇవ్వాలి " అన్నారు అందరూ.

" కాలుష్యం నుండి " చుట్టుపక్కల నుండి అప్పుడే అక్కడకు చేరుకున్న మూడు రంగుల జెండాల వాళ్ళనగానె.

"మమ్ములను కాపాడేలే " అన్నారు వాళ్ళ అనుచరులు.

ఈలోపు హైదరాబాద్‌లో ఫ్యాక్టరీ యజమానుల ఇండ్లని కాషాయపు జండాల వాళ్ళు చుట్టుముట్టారని వార్త. అది తెలవగానే రెండు పార్టీల వాళ్ళు అయోమయంలో పడ్డారు. ఆ తరువాత లారీలలో పెద్దసంఖ్యలో జనం వచ్చేశారు. అక్కడంతా పొద్దుతిరుగుడు పూలతోట వున్న దృశ్యం. అది చూసి అప్పటివరకు అక్కడున్న వాళ్ళు ఇక లాభం లేదు అని జారుకున్నారు. మిట్టమధ్యాహ్నం ఎర్రటి ఎండ. ఉదయం వచ్చి కూర్చున్న జనం మాత్రం కదలటం లేదు. చుట్టూ వున్న ఊళ్ళవాళ్లొచ్చి తమ మద్దతు ప్రకటిస్తూనే ఉన్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న తమ తమ యజమానులకు ఫ్యాక్టరీ వాళ్ళు ఫోన్‌ల ద్వారా విషయాలను ఎప్పటికప్పుడు తెలియపరుస్తూనే ఉన్నారు. అన్ని పార్టీల వాళ్ళు కల్లోలం సృష్టించారు. పోలీసులు వచ్చారు. జనాన్ని చెదరగొట్టాలని చూశారు. ఎవ్వరూ వినేట్టు లేదు. పోలీసులు లాఠీలు ఊపారు. జనం రాళ్ళందుకున్నారు. పరిస్థితి విషమించడం చూసిన పోలీసులు రిజర్వుడు బలగాలను తెప్పించుకున్నారు. చేజారితే ప్రమాదమని గ్రహించిన డి. ఎస్. పి. టియర్ గ్యాస్ వదలమన్నారు. కొద్దిక్షణాల్లో అక్కడంతా అయోమయం. జనం చెల్లాచెదురై రోడ్ల వెంట పరుగెడుతున్నారు. సర్పంచ్, బడా, ఛోటా నాయకులు పోలీసులతో గొడవ పడుతున్నారు. ప్రజలను వదిలి కేపిటలిస్టుల కొమ్ము

కాస్తున్నారని పోలీసులపై విరుచుకుపడుతున్నారు. గూడెం వాళ్ళ మధ్య, పారిశ్రామిక వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది.

* * *

ఆ సాయంత్రం పసికూనలను మట్టిలో పూడ్చింది సీతమ్మ. పిల్లలు గుర్తొచ్చి కంట నీరూరింది సీతమ్మకు. ఆమె భర్త రాములు బొంబాయికి బ్రతుకుతెరువుకు పోయిన్నాటి నుండి ఆమె ఇంట్లో ఒంటరిదైపోయింది. చేతికందిన కొడుకు ఉద్యోగం దొరక్క ఎటువెళ్ళిందీ తెలియక రోజుకు ఒక్కసారన్నా ఏడుస్తూనే ఉంటుంది. ఆ రోజుల్లో ఆ రామునికి పదునాలుగేండ్లు వనవాసం అయితే ఈ రోజుల్లో భూమి అమ్మిన నాటినుండి తన రామునికి పదునాలుగేండ్లు నిండాయి. గతం కళ్ళముందు కదలాడగా సీతమ్మకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. అంతపెద్దపెంకుటింట్లో తోడుకోసం తెచ్చుకున్న ముసలమ్మ గుర్రు పెడతూ పడుకుంది.

ఏ బాధ లేని మనిషిని నిద్ర నీడలాగా వెంటాడుతుంది. బాధలున్న మనిషికి నీడ కూడా తనకు దూరం అవుతుంది.

సీతమ్మ పదిహేను ఏండ్ల కిందటి తన సంసారాన్ని గుర్తు చేసుకుంది

హైదరాబాదు నుండి నార్కెట్‌పల్లి ఆఖరు శివారు వరకు భూమి అమ్ముడుపోయింది. వంటి మీద పచ్చలాగ భూమి మీద అన్నీ హద్దులే. రోడ్డు పక్కమ్మటే అయితే ఫ్యాక్టరీలు, కాస్తలోపలికైతేనేమో కాలనీలు. గుట్టా - పుట్టలను వదలటం లేదు.

"రాములు ఈ పదెకరాలు ఉంచుకొని ఏం చేస్తావు" అన్నాడు భూములను అమ్మి కొనిపెట్టే బ్రోకర్. ఇద్దరు తన భూమిలో నిలబడి మాట్లాడుకుంటున్నారు. కొంత దూరంలో కారు ఆపుకొని పక్క భూమినంతా కొని ఫెన్సింగ్ చేయించిన రాజు, ఇంకెవరో మాట్లాడుకుంటున్నారు. కనుచూపు మేరంతా మా రెడ్డిగూడెం శివారే.

"చెప్పు రాములు రాజుగారితో చెప్పి నీకు మంచి గిట్టుబాటు ధర ఇప్పిస్తాను. ఓ మాట అను" అన్నాడు బ్రోకర్, తన పంచెను మోకాళ్ళ వరకు లేపి పట్టుకొని.

ఆయన చుట్టూ చూశాడు. కనుచూపు మేరంతా అప్పటికే అమ్ముడుపోయింది. ఒక్క ఊరు, ఊరివైపూ ఉన్న తరిపొలాలు, తమ భూమి తప్ప. అది తాతల నుండి వస్తున్న ఆస్తి.

"అంతా అమ్ముడుపోయినంక నీవు మాత్రం ఏం పండిస్తావు" అన్నాడు బ్రోకర్.

"ఏం ఫ్యాక్టరీ పెడతాడట?" అడిగాడు ఆయన.

"ఎలుకల మందు ఫ్యాక్టరీ, ఏ ఫ్యాక్టరీ పెడితే మనకెందుకు. మనది మనం చూసుకోవాల" అన్నాడు బ్రోకర్. కుడిచేతిలోని ధోవతి వదిలి అదే చేతిని రాములు భుజం మీద ఉంచి.

"అట్లా అంటే ఎట్లా. ఊరికి ఉపకారమా, అపకారమా కూడ ఆలోచించాలి కదా"

అన్నాడు అక్కడికి ఆయన.

"ఊరు సంగతి వదిలేయ్. మన మీద మనకు మమకారం తగ్గకుండ చూసుకోవాలి. ఇక్కడ పదెకరాలు అమ్మి మరోచోట ఇరవై ఎకరాలు కొనుక్కోవాలి. కొందరు కోస్తా రైతులు చూడు. అక్కడ వాళ్ళ భూములను హెచ్చుకు అమ్ముకొనొచ్చి మన దగ్గర తక్కువకు ఎకరాల కొద్దీ కొని కొత్తగూడాలనే కడుతున్నారు. మనమేమో ఉన్న ఊరు వదలం. బ్రతుకు కూడా ఉన్న చోటనే ఉంటుంది. మళ్ళీ కలుస్తాము. ఆలోచించి చెప్పు. ఇక్కడ ఫ్యాక్టరీ పెడితే పదిమందికి పని దొరుకుతుంది. మీ పిల్లగాడు చదువుకుంటున్నాడన్నావు. అతనికి ఓ నౌకరీ ఖాయం " అంటున్నప్పుడే కారు హారన్ మోగింది.

"అదిగో రాజు గారు పిలుస్తున్నారు. ఈలోపు మళ్ళొస్త. ఆలొచించుకో. మామాట విను. బాగు పడతావు " అంటూ అక్కడినుండి కదిలాడు బ్రోకర్. వారం రోజుల తరువాత రిజిస్ట్రేషన్ ఆఫీసులో నోట్లు ముట్టినాక సేల్‌డీడ్ మీద సంతకం చేశాడు ఆయన. తాను వేలిముద్ర వేసేటప్పుడు రెండు కన్నీటి చుక్కలు రాలినాయి. గుర్తు రాగానే మళ్ళీ కళ్ళలో నీరు ఊరింది.

తన పొలంలో సకల పంటలు పండేవి. పశువులతో కలకలలాడే దొడ్డి కూలిపోయింది. మేకలన్నీ పోయి కోడిపిల్లలు మిగిలాయి. ఇంటిముందున్న పేడకుప్ప పోయి ఒట్టి కసువు దిబ్బ మిగిలింది. పండుగనాడు కొనుక్కొచ్చుకొనే పప్పులు తప్ప ఇంట్లోనే వుండే కందులు, పెసలు, అలసందలు కరువైనాయి. వాకిట్లో ఎండపోసుకునే మిరపపండ్లు మళ్ళ చూసెదెప్పుడు? పండుగలప్పుడు, నోములప్పుడు వేలాడే బంతి పూల దండలు చూడక ఎన్నాళ్ళైంది. ఆనాడు భూమిని అమ్ముకోకపోతే ఈనాడు ఈ గతి పట్టేది కాదు. పంటపొలాలన్నీ ఫ్యాక్టరీలు అయిపాయె. పంటచేల పైనుండి వచ్చే వెచ్చని గాలి పోయి కంపుగాలి పీల్చవలసి వచ్చె. తేనెటీగల మోత ఎటుపోయిందో. కాయలను, కంకులను మోసిన చోట ఇటుకలు మోస్తిమి. పంటలను రాసిపోసిన కల్లంలో సిమెంటు, కంకర కలిపితిమి. ఆనాడు ఎకరానికి ఎంత ఇచ్చిండ్రని? అతడిచ్చిన డబ్బు వుందా? కర్పూరంలాగా కరిగిపోయె. పిల్లపెండ్లికి, పిల్లగాని చదువుకు కొంత, కోళ్ళఫారమని పెడితె కొంపముంచి పోయె. అదేమి మాయరోగమో రెండు రోజుల్లో గుడ్లకొచ్చిన కోళ్ళు చచ్చె. తెరిపిలేని తుఫాను గాలొచ్చి షెడ్డు రేకులు లేసిపాయె. దెబ్బ మీద దెబ్బ. లేవకుంట అయిపాయె. ఏమంట భూమిని అమ్మినమో బతుకే బండలపాలయె. ఏట ఏడుధాన్యాలతో పాలు-పెరుగు తిన్నోళ్ళకు ఎంత దరిద్రం దాపురించె.

పక్క ఊరులో ఉన్నంత వరకు చదివి ఆ తరువాత ఆగిపోయి చెయ్యెత్తు కొడుకు ఎటుపోయనో తెలవకపాయె. చేయగల్గింది పొలంపనులాయె.

కనుచూపు మేర దున్నే భూమి ఎక్కడ? పొలాలెక్కడ? ఫ్యాక్టరీలొస్తే అందరికి

పనులొస్తయనిరి. అంటే ఆ కట్టేటప్పుడు పార పని, తట్టపనేనా? అదైనా ఎంతకా నడిచింది?

అదేం చిత్రమో ఊళ్ళోన, ఊరు చుట్టూ వున్న ఆకులు పచ్చగా కాకుండా పండకముందే రాగిరంగులోకి మారుతున్నాయి. ఈతాకులు ఎండుచొప్పలాగ, తాటాకులుసగం ఎండిపోయి వుంటున్నాయి. చెట్లమీద పక్షులు వాలటం లేదు. కోళ్ళఫారాలన్నీ కొమ్మల్లో కాకులు వదిలేసిన గూళ్ళలాగా మిగిలిపోయినాయి. దేశాలు పట్టిపోగా మిగిలిన జనం, ఆడవాళ్ళు రంగు వెలసిన పాత చీరలాగున్నారు. మగవాళ్ళు ఎండిపోయిన కొబ్బరకాయల్లాగున్నారు. ముక్కుల్లో దురద, కళ్ళపొంటి నీరు కారటం లాంటి కొత్త రోగాలు మొదలాయె. ఎడ్లు, దొడ్లు ఒకటేమిటి, ఎటు చూసినా పాడుపడ్డ గుడిలాగే వుంది.

అనుకుంటా కలత నిద్రలోకి జారుకుంది సీతమ్మ.

పక్కవూళ్లో వున్న ఎస్.టి.డి. బూత్ నుండి నెంబర్ డయల్ చేసి-

"హల్లో సర్పంచ్ గారా? " అడిగాడు ఉపసర్పంచ్ మల్లేశం.

"మాట్లాడుతున్న " అవతలి కంఠం.

"మీరు వెంటనే బయలుదేరి మన ఊరు వచ్చేయాలి "

"అంత అర్జంటా "

"అర్జంటే. గూడమంతా ఆగం ఆగం ఆయిపోయింది. రాత్రి జీబుల్లో కొందరు వచ్చి జనాలను కొట్టి ఎవరికైనా చెపితే మళ్లోరోజు వచ్చి ఊరుకు నిప్పు పెట్టి అందర్నీ కాళ్ళు చేతులు కట్టి అదే మంటల్లో పడేస్తం అన్నారు. ఏం జెప్పం, చేతుల్లో చైనులు, ఇనుప చువ్వలు ఉన్నాయి . సురకత్తులు ఉన్నాయి. వచ్చే రాకడనే ఎక్కడ వున్నోళ్ళను అక్కడ పట్టుకొని కొట్టబట్టిరి ". - ఉపసర్పంచ్.

"ఎక్కడోళ్ళు? ఎందుకొచ్చింండ్రట? "

" ఏది చెప్పలేదు. ఒచ్చెరాకడ కొట్టు డే కొట్టుడు. ఆకర్న పోయేటప్పుడు మీలో ఎవరైనా ఫ్యాక్టరీల తెరువు పోతిరో చంపేస్తం అన్నారు. ముండాకొడుకులు తాగి వున్నారు. చెప్పినా వినేటట్లు లేదు. అడ్డం వచ్చిన ఆడోళ్ళను కూడా కొట్టింండ్రు. గూడెమంతా గడగడ వణికిపోతుందనుకో. ఇక్కడికి వచ్చినంక మాట్లాడుకుందాం, వెంటనే వచ్చేయి" - అని ఫోన్ పెట్టేశాడు.

సర్పంచ్ తల నిండా ఆలోచనలే. 'ఫ్యాక్టరీ నాకొడుకులు పైసల మస్తితో ఇదంతా చేయించి కష్టాలను కొనితెచ్చుకుంటున్నరు. నాతోటేమో " కాలుష్య నిరోధక పద్ధతుల ద్వారా

ఊరికి అపాయం కలుగకుండా చూద్దాం. దయచేసి జనాన్ని మీరే కంట్రోల్ చేయాలి. వాళ్ళు మీరు చెపితేనే వింటరు. మేము ఏం మాట్లాడినా రెచ్చిపోతున్నరు" అని అన్నారు. నేను ఊళ్ళో లేనిది చూసి ఈ పనికి పాలుపడ్డరు. వీళ్ళను క్షమించేది లేదు' అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసికొని బయలుదేరాడు.

అంతకుముందే పోలీసులు జీపులో వచ్చి రాత్రి ఊళ్ళోకొచ్చిందెవరు? అని ఆరా తీస్తూ ఉన్నారు.

"ఎందుకొచ్చారు" అని పోలీసులు అడుగుతూ ఉన్నారు.

తెలియదని జనం అంటున్నారు.

"ఎవరెవరిని కొట్టారు" - ఎస్. ఐ ప్రశ్న.

దెబ్బలు తిన్నవాళ్ళు గుడ్డలు తొలగించి కందిన భాగాలను చూపించారు.

"వాళ్ళు కొడుతుంటే మీరేమీ అనలేదా?" - అడిగాడు ఎస్. ఐ.

"అసలు నోరెత్తనిచ్చింద్రా తండ్రి?" - ఓ బాధితుడు.

"ఎంత మంది వున్నరు?"

"ఇరవైదాకా వున్నరు" - అని చెప్పాడు వెంకులు. వెంకులును కొడితే వీపున చర్మం చిట్లిందని అంగి విప్పి చూపించాడు.

"ఇరవైమందిని ఊరంతా కలసి ఏమీ చేయలేకపోయారా?" - ఎద్దేవా చేసినట్లు అన్నాడు ఎస్. ఐ . ఎవరూ మాట్లాడలేదు. మౌనంగా నిల్చున్నారు.

"మరి మాకెందుకు ఫిర్యాదు చేయలేదు ?" - అడిగాడు హెడ్ జీపు దగ్గర నుండి మందిలోకి వస్తూ.

"సర్పంచ్ రాగానే........" మెల్లగా అన్నాడు మల్లేశం.

"అంటే సర్పంచ్ లేంది గంజే తాగటం లేదా?"

ఈసారి కూడా ఎవరూ మాట్లాడలేదు. ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ నిలబడ్డారు.

"రాత్రి వచ్చింది గూండాలు అనుకుంటున్నరేమి ? కాదు" అని సీరియస్‌గా అనగానే అందరూ ఎస్. ఐ వైపు చూశారు.

"వాళ్ళు తుపాకులతో వచ్చారు. మిమ్ముల డబ్బు కూడా అడిగారు అవునా ?" మళ్ళీ తానే అన్నడు. అందరూ ఒకరి మఖాలు ఒకరు చూసుకున్నారు. ఆయన అంటున్నది ఎవరికీ ఏం అర్థం కాలేదు.

"రాచకొండ వైపు ఎవరు తిరుగుతున్నారో మీకందరికి తెలుసు కదా" అంటూ

అందరివైపు చూశాడు. మిగిలిన పోలీసు జవానులు 'అవును' అంటున్నట్లు చూస్తూ ఉన్న చోటు నుండి కదిలారు.

" వాళ్ళు మా దగ్గర్కి ఎందుకు -- " అనే లోపే -

"వస్తరు అంటవు. మీ భూములు అమ్మిన పైసలు ఏమన్నా ఉన్నాయో ఏమో " అని అన్నాడు హెడ్ కానిస్టేబుల్ ఎస్. ఐ మాటలకు మద్దతుగా.

"వాళ్ళు ఫ్యాక్టరీ గూండాలు సారూ " - అన్నాడు మల్లేశం.

"అని నీవంటే మేం నమ్మాలా?" - అంటూ ఎస్.ఐ గుడ్లురిమి చూశాడు. మక్కెలిరుగుతయ్ జాగ్రత్త అన్నట్లు.

" ఆడ కనబడతనే వుంది " మల్లేశం అనేలోపే

"వీడు ఇన్‌ఫార్మర్‌లాగున్నాడు చూడు " అన్నాడు ఎస్.ఐ. మతలబుగా.

హెడ్ అతన్ని పక్కకు తీసికెళ్ళి 'జీపు' ఎక్కమన్నాడు.

"ఏమిటి అతన్ని జీపు ఎక్కమంటున్నారు " అంటూ అడిగాడు అప్పుడే అక్కడికి వచ్చిన సర్పంచ్.

"ఓహో. సర్పంచ్ గారా, ఊరు తగులబడుతుంటే తమరు పట్నంలో పార్టీ చేసుకొని ఇప్పుడొస్తున్నారా "అన్నాడు ఎస్. ఐ. వెటకారంగా.

"మీరు మాత్రం రాత్రి వచ్చారా? మీరు వచ్చింది ఇప్పుడేగా "అన్నాడు సర్పంచ్ తొణక్కుండా.

"మంచిది. అందరం ఇప్పుడే వచ్చాం. జీపు ఎక్కండి. స్టేషన్‌లో మాట్లాడుకుందాం అంటూ జీపువైపు నడిచాడు ఎస్. ఐ.

" ఎవరు జీపు ఎక్కరు. అందరం నడిచే వస్తాం " అన్నాడు సర్పంచ్ జనం వైపు మళ్ళి.

"అందరెందుకు? చెబుతుంటే సమజ్ అయితలేదు. సార్ ఎవర్ని రమ్మంటే వాళ్ళే రావాలి అంతే "

" ఊళ్ళో జరిగిందేదో ఊళ్ళోనే అడిగితెల్సుకోవాలిగాని స్టేషన్‌కు పోయి ఏం చేస్తాం " అన్నాడు సర్పంచ్ హెడ్ కానిస్టేబుల్‌ని ఉద్దేశిస్తూ.

"రాత్రి వచ్చింది గూండాలు కాదట. నేను ఇన్ ఫార్మర్‌నట. వాళ్ళు ఇష్టమొచ్చినట్లు అంటున్నారు " - అన్నాడు ఉప సర్పంచ్.

అందరూ తలోమాట అంటున్నారు. అక్కడున్నవాళ్ళు పోలీసులను ఏమంటున్నరో తెలియని పరిస్థితి. బలవంతంగా సర్పంచ్‌ను , ఉపసర్పంచ్‌ను జీపులోనికి తోశారు. అది చూసిన జనం రెచ్చిపోయి చుట్టుముట్టి జీపును కదలకుండా చేశారు. ఎస్. ఐ. రివాల్వర్‌ను

చేతిలోనికి తీసుకున్నాడు. పోలీసులు, జనాల మధ్యఘర్షణ పెరిగింది. లాఠీ ఛార్జి జరిగింది. రాత్రి గూండాలు, ఉదయం పోలీసుల జులుం. గూడెం గాయపడ్డది.

ఆ రోజు తెల్లవారేసరికి ఎవరింట్లోనూ కోడి కూయలేదు. పొగరాజలేదు. ఏ వాకిట్లో కల్లాపు చల్లలేదు. తమకోసం దాచుకున్న తేనెను నరుడు దోచుకోగా వొట్టి తెట్టు మాత్రమే మిగిలినట్లు ఆ వూరు. ఆ వూళ్ళో ఎవరూ లేరు. నిన్న మొన్న కోతలు కాగా, కోయకళ్ళ ముళ్ళు బోసిగా కనిపిస్తూ ఉన్నాయి. దొడ్లలో పశువులు లేవు. ఈ జనం ఎటువెళ్ళినట్లు? నాటి దారి ఖర్చులు ఏది? ఒక్కరాత్రే గూడెం మొత్తం ఖాళీ, అవును ఫ్యాక్టరీల విషపు గాలులు ? యజమానుల కక్ష సాధింపు గుండాగిరి. మరొకవైపు పోలీసుల లాఠీ దెబ్బలు. తట్టుకోలేక ఊరొదిలిపోయారా? ఏ ఒక్కరు తనతో మాట మాత్రమైనా చెప్పలేదే? చెపితే నేను అడ్డుపడతాననా? అందరూ అదే నిర్ణయం తీసుకుంటే నేను మాత్రం ఏం చేస్తాను. అందరూ ఊరొదిలి పోతే నేను మాత్రం ఒక్కణ్ణే ఈ ఊళ్ళో వుంటానా? బతికి వుంటే బలుసాకు తినైనా అని అన్నారు కదా పెద్దలు. అందుకేనేమో వూరు వదిలి వెళ్ళారు.

ఓ పిల్లి మావ్ మావ్ అంటూ ఆ ఇంట్లో నుండి ఈ ఇంటికి తిరుగుతూ ఉంది. దాని వెనకాల దాని నాలుగు పిల్లలు ఉన్నాయి. బడి ఒదిలినాక కనిపించే క్లాసు రూముల్లాగా ఇండ్లు. వాళ్ళంతా వెళ్ళిపోయాక తాను మాత్రం ఇక్కడ వుండి ఏంచేయాలి. అనుకుంటూ , ఇంటికి తాళం వేసి రొడ్డువైపు నడిచాడు. ఊరు చుట్టూరా నిర్మానుష్యంగా వుంది. పైన గద్దలు తిరుగుతూ వున్నాయి. తాటి చెట్లకు లొట్లు వెలాడతున్నాయి. చుట్టూ చూస్తూ రోడ్డెక్కాడు. వాహనాలు వస్తూ పోతు ఉన్నాయి. సైరన్ చప్పుడుతో పైలెట్ జీపు, దాని వెనకాల రెండు మూడు కార్లు దూసుకు వెళ్ళాయి. ఆయన ఆగి 'ఈ వూరు ఎందుకు ఖాళీ అయిందొ అడగలేదే. ఎలక్షన్నప్పుడు తప్ప ఈ నాయకులకు మరెప్పుడూ జనం గుర్తు రానట్లు వుంది. వాళ్ళు లేకుంటే ఏం. ఓటరు లిస్టు వుంటే చాలు కదా. పత్రికల వాళ్ళకు ఈవూరి విషయం చెప్పాలి. అనుకుంటున్నప్పుడే బస్సు వచ్చి ఆగింది.

ఓ చేతిలో చక్రాలున్న పెద్ద సూట్‌కేసుతో మరో చేతిలో ఓ పెద్ద లగేజి బ్యాగుతో ఓ వ్యక్తి దిగాడు. కళ్ళకున్న చలువద్దాలను తీసి జేబులో వేసుకుంటూ సత్యాన్ని చూస్తూ -

'మీరు' అంటూ ఆగిపోయాడు.

బస్సు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్న సత్యం "ఈ ఊరి హెడ్మాస్టరును" అంటూ బస్ డోరును పట్టుకున్నాడు.

"మీరు సత్యం సారేనా" అన్నాడు నవ్వుతూ.

"అవును" అని తలాడించి బస్సు మెట్టు మీద కాలు మోపే ప్రయత్నంలో వున్నాడు సత్యం.

"ఎక్కడ పోతుండ్రు సార్ "

" నన్ను గుర్తుపట్టారా సార్. నేను గోపాలాన్ని "

"చాలాకాలమైంది చూడక " అన్నాడు సత్యం గోపాలాన్ని ఎగాదిగా చూస్తూ.

"తరువాత బస్సుకు పోవచ్చు రండి " అన్నాడు గోపాల్ తన కుడి చేతికి వున్న వాచ్‌లో టైం చూస్తూ.

"సరె " అంటూ సత్యం మొదటి మెట్టు మీదుంచిన కాలు వెనక్కు తీసుకున్నాడు.

కండక్టర్ డోర్ వేసుకొని "రైట్ " అన్నాడు. బస్సు కదిలింది.

"నీవు వూరు విడిచి వెళ్ళి పదిహేను ఏండ్లపైన కాలే ? "

"కాలే మరి, నా పెండ్లయి పదిహేను ఏండ్లయింది. దుబాయికి పోయిన మూడేండ్లకు పెళ్ళయింది "

" నీ అత్తగారు కూడ బొంబాయి అనుకుంట " - సత్యం

"అందుకే కదా సార్ ఈ ఊరికి రాకుండా పోయింది. వస్తే బొంబాయి రావడం అటునుండి అటే మళ్ళి దుబాయి పోవడం. పిల్ల జెల్లలంతా అటేనాయె. అమ్మ అయ్య ఇద్దరు చిన్నప్పుడే పోయిరి " అన్నాడు గోపాల్ తనకు తానే దిక్కులేని వాడుగా ఫీలయినట్టు ఆయన ముఖంలో కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

"ఇల్లు, ఏమైనా చెలుక " అడిగాడు సత్యం.

"ఇల్లుండె దాన్ని మా పాలోడే మలుపుకుండట. చెలుకను అమ్ముకొనే గదా దుబాయికి పోయింది. ఇప్పుడయితే ఏమి లేదు. ఊరోళ్ళను చూసి పోదామని వస్తి. "

"అలాగా ఆ ఇంట్లో వుండే అంజయ్య మీ పాలోడేనా ? "

"అవును " అన్నట్టు తల వూపుతూ రోడ్డుపక్కమ్మట వున్న తంగేడు పొదల వైపు చూపు నిలిపాడు. సరిగ్గా అప్పుడే ఓ పాము సర్‌న పరుగెత్తి పుట్టలోకి పోయింది. దాన్ని వెంటాడుతూ ఓ ముంగిస ఆ పుట్ట దగ్గర ఆగిపోయింది.

"ఊరు చాలా మారిపోయింది సార్ " చుట్టు కనిపిస్తున్న ఫ్యాక్టరీల వైపు చూస్తూ అన్నాడు.

"ఊరు మారుపోవడం కాదు, పారిపోయింది " అన్నాడు సత్యం.

"అంటే " ఆశ్చర్యంగా చూశాడు గోపాలం.

"నిజమండి, పోనీ, రోడ్డు మీద కాని, చుట్టపక్కల కానీ మీకెవరైనా మనుషులు కనిపిస్తున్నారా. "

"అవును మనుషుల కదలికే లేదే " అంటూ చుట్టూ పరిశీలనగా చూస్తూ సగం తెరిచివున్న పెదాల మీద చూపుడు వేలినుంచాడు.

"నీవు పోయిన్నాటికి, నేటికి ఇక్కడ చాలా మార్పులొచ్చాయి. "

"అవును సార్. పంటలు పండే భూములన్నీ ఫ్యాక్టరీలైనట్టు బొంబాయిలో మనోళ్ళు చెబుతుండే వాళ్ళు కానీ ఇంతకాడికొస్తుందనుకోలేదు "

"మొదట్లో ఏదీ అట్లా అనిపించదు "

"ఈ పొడుగూతా వున్న ఫ్యాక్టరీలన్నీ మందులు తయారు చేసేవే. వాటి కాలుష్యం వల్ల వాతావరణమంతా విషపూరితమై మనుషులకు హాని చేస్తున్నాయి, పసిపిల్లల ప్రాణాలు తీస్తూ వున్నాయి" అనగానే -

"అట్లనా ఎంత ఘోరం " అంటూ బరువైన శ్వాస ఒదిలాడు.

"ఈ భూములు అమ్ముకొన్నోళ్ళు అప్పుడే ఇంకెక్కడన్నా కొనుక్కోలేదు" అడిగాడు గోపాల్.

"ఆ పని చేయకనే ఇప్పుడు ఈ పాట్లు. అప్పుడు అమ్మిన డబ్బులతో కొందరు కోళ్ళ ఫారాలు పెట్టారు. ఈ విషపు గాలి వల్ల లేయర్స్ గుడ్లు పెట్టలేదు. బాయిలర్స్ బతుకలేదు " సానుభూతిని కనబరిచాడు.

"ఛో.ఛో " అంటూ అంగలార్చాడు గోపాల్.

"ఇట్లాంటి ఫ్యాక్టరీలు ఏ అడవి లోనో పెడితే బాధలు ఉండవు. ఏ బాధలు వుండవు. దుబాయిలోనైతే అట్లనే వుంటాయి "

"అట్లనా అన్నట్టు చూస్తున్నాడు సత్యం. ఈ లోపు బస్సు వచ్చి ఆగింది.

"వస్త " అంటూ సత్యం బస్సెక్కాడు. బస్సు కదిలింది.

గోపాల్ చుట్టూ చూసి తాను వెళ్ళే బస్సు కోసం వేచి వున్నాడు. పుట్టి పెరిగిన బాల్యం గుర్తొచ్చి కళ్ళనిండా కన్నీరు ఊరింది. ఎద నిండా ఏదో దిగులు నిండింది.

ఇంతకు ముందు పుట్టలోకి పోయిన పాము పడగను బయటపెట్టి చూస్తూ వుంది.

సెప్టెంబర్ 99..